సాక్షి ఖమ్మం

సోమవారం | 29 | మే | 2023



ఇసుక రవాణాపై కొరడా

మధిర మీదుగా ఇసుక అక్రమంగా తరలిస్తున్న పదుల సంఖ్యలో ట్రాక్టర్లను పోలీసులు ఇటీవల సీజ్ చేశారు. 8లో



పెరుగుతున్న జాబితా

ఇల్లెందు జేకే ఓసీ నిర్మాణంలో భూములు కోల్పోతున్న నిర్వాసితుల జాబితా నానాటికీ పెరుగుతోంది. 10లో

గరిష్టం / కనిష్టం
42° / 28°

వాతావరణం

జిల్లాలో సోమవారం ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతాయి. రాత్రి పూట కూడా వేడి వాతావరణమే ఉంటుంది.

న్యూస్‌రీల్

నేడు భద్రాద్రి జిల్లాలో మంత్రి పువ్వాడ పర్యటన

ఖమ్మంమయూరిసెంటర్ : రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ సోమవారం ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 9 గంటలకు భద్రాద్రి జిల్లా బూర్గంపాడు మండలం లక్ష్మీపురంలో, 9.45 గంటలకు అశ్వాపురం మండలం నెలిపాకలో, 10.15 గంటలకు తుమ్మలచెరువులో, 10.35కు గొందిగూడెంలో రోడ్డు, హైలెవల్, లోలెవల్ బ్రిడ్జి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తారు. 11.45 గంటలకు మణుగూరు మండలం గట్టుమల్లారంలో ఎంపీడీ యూనిట్ కార్యాలయ నూతన భవన నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు. 12.05 గంటలకు మణుగూరులో బీఎస్ఎన్ఎల్ ఆఫీస్ వద్ద రోడ్డు వెడల్పు పనులకు, సైడ్ డ్రైన్ నిర్మాణ పనులకు, 12.25 గంటలకు అంబేద్కర్ సెంటర్‌లో మణుగూరు–నెలిపాక రోడ్డు మరమ్మతు పనులకు శంకుస్థాపన చేయనున్నారు. 2.30 గంటలకు కొత్తగూడెం జిల్లా ఐడీవోసీలో తెలంగాణ అవతరణ దినోత్సవ వేడుకలపై అధికారులతో సమీక్షించనున్నారు. 5 గంటలకు ఇల్లెందులో నియోజకవర్గ ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి పాల్గొంటారు. రాత్రి 7 గంటలకు తిరిగి ఖమ్మం చేరుకుంటారు.

క్రికెట్ పోటీల విజేత జడ్జి జట్టు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న జిల్లా జడ్జి బి.ఎస్.జగ్జీవన్ కుమార్

ఖమ్మం లీగల్ : తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా ఖమ్మం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం సర్దార్ పటేల్ స్టేడియంలో క్రికెట్ పోటీలు నిర్వహించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.ఎస్.జగ్జీవన్ కుమార్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దిరిశాల కృష్ణారావు, క్రీడల కార్యదర్శి రావుల వెంకట్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ.. ఆటలతో మానసికోల్లాసం కలుగుతుందన్నారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి, ప్రెసిడెంట్ జట్ల మధ్య మ్యాచ్‌లు నిర్వహించగా.. జడ్జి జట్టుకు దిలీప్, ప్రెసిడెంట్ జట్టుకు రావుల వెంకట్ కెప్టెన్‌లుగా వ్యవహరించారు. ఈ మ్యాచ్‌లో జిల్లా ప్రధాన న్యాయమూర్తి జట్టు గెలుపొందింది. కార్యక్రమంలో బార్ కౌన్సిల్ సభ్యుడు కొల్లి సత్యానారాయణ, న్యాయవాదులు కేవీవీ లక్ష్మి, శ్రీలక్ష్మి, శారద, అరుణ, రాధ, వాసవి, తాళ్లూరి దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

రామయ్యకు సువర్ణపుష్పార్చన



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానంలో ఆదివారం అంతరాలయంలోని మూలమూర్తులకు అభిషేకం, సువర్ణ పుష్పార్చన జరిపారు. తెల్లవారుజామున గర్భగుడిలో సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం స్వామివారిని పల్లకీ సేవగా చిత్రకూట మండపానికి తీసుకొచ్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు. నిత్యకల్యాణంలో పాల్గొన్న భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రసాదాలను స్వీకరించారు. సెలవు రోజు కావడంతో భక్తులు పెద్ద ఎత్తున స్వామి వారి సేవల్లో పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం

శ్రీసీతారామచంద్ర స్వామివారి దేవస్థానంలో జరిగే శాశ్వత నిత్యాన్నదాన కార్యక్రమానికి ఆదివారం హైదరాబాద్‌కు చెందిన భక్తులు విరాళం అందజేశారు. మణికొండలోని అపర్ణ వెస్ట్‌సైడ్ అపార్ట్‌మెంట్‌కు చెందిన ముమ్మడి వాసుదేవ రెడ్డి, ప్రసన్న దంపతులు రూ.లక్ష నగదును అధికారులకు అందజేశారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ సిబ్బంది సాయిబాబు, ఆర్‌వి నర్సింహారావు పాల్గొన్నారు.

సేవల్లో ఘనాపాటి..

- జిల్లా పెద్దాస్పత్రిలో ఏడాదిలో 40వేల మందికి అల్ట్రా సౌండ్ స్కానింగ్
- సీటీ స్కాన్‌లు ఆరు వేలకు పైగానే..
- ఏడు లక్షలు దాటిన ల్యాబ్ టెస్టులు
- ఆధునిక వ్యాధి నిర్ధారణ పరీక్షలతో పేదలకు మెరుగైన సేవలు



జిల్లా పెద్దాస్పత్రిలో అల్ట్రాసౌండ్ విభాగం వద్ద రద్దీ

ఖమ్మం వైద్యవిభాగం: ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిలో వ్యాధి నిర్ధారణకు ఆధునిక సేవలు అందుబాటులోకి రావటంతో బాధితులకు మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయి. ఎలాంటి వ్యాధికైనా ఇక్కడే నిర్ధారణ పరీక్షలు చేస్తుండటం వారికి ఉపశమనం కలిగిస్తోంది. గతంలో స్కానింగ్, ల్యాబ్ టెస్టుల కోసం ప్రైవేటు బాట పట్టేవారు. ఇప్పుడా సమస్య లేదు. అల్ట్రా సౌండ్, సీటీ స్కాన్, ఎక్స్‌రే, టిఫా మిషన్ల ద్వారా నిత్యం వందలాది మందికి ఇక్కడే పరీక్షలు చేస్తున్నారు. దీంతో వేల రూపాయల వ్యయం అయ్యే పరీక్షలు ఉచితంగా చేస్తుండడంతో బాధితుల్లో ఆనందం వ్యక్తం అవుతోంది. పెద్దాస్పత్రిలో అల్ట్రా సౌండ్ మిషన్లు నాలుగు ఉండగా సీటీ స్కాన్ మిషన్ పాతబడి చాలా యేళ్లుగా అందుబాటులో లేకుండా పోయింది. దీంతో రెండేళ్ల క్రితం ప్రభుత్వం ఆధునిక సీటీ స్కాన్‌ను అందుబాటులోకి తెచ్చింది. అలాగే ఇటీవల ఆస్పత్రికి రెండు టిఫా మిషన్లు కూడా కేటాయించటంతో వాటి ద్వారా మరికొన్ని సేవలు అందుబాటులోకి వచ్చాయి. దీంతో నిత్యం వందలాది మంది స్కానింగ్ సేవలు వినియోగించుకుంటున్నారు.

భారీగా పెరిగిన అల్ట్రా సౌండ్ సేవలు..

గర్భిణులు, సాధారణ పేషెంట్లకు అల్ట్రా సౌండ్ మిషన్ ద్వారా వ్యాధి నిర్ధారణ చేస్తుంటారు. గర్భిణులకు కడుపులో బిడ్డ స్థితిని, గర్భాశయంలో, కడుపులో సమస్యలను స్కాన్ చేసి తెలుసుకుంటారు. అలాగే సాధారణ రోగులకు లివర్, కిడ్నీ, గ్యాస్ట్రిక్ తదితర సమస్యలు తెలుసుకునేందుకు స్కానింగ్ చేస్తుంటారు. సాధారణంగా ప్రైవేటు సెంటర్లలో పరీక్ష చేయించుకుంటే సమయం వృథాతో పాటు డబ్బు కూడా ఖర్చవుతుంది. కానీ పెద్దాస్పత్రిలో ఉచితంగా అందడంతో పాటు సమయం కూడా ఆదా అవుతోంది. ఈ ఆస్పత్రిలో గతేడాది ఏప్రిల్ నుంచి ఈ సంవత్సరం ఏప్రిల్ వరకు 40,427 మందికి అల్ట్రా సౌండ్ స్కానింగ్ చేసి రాష్ట్ర స్థాయిలో రికార్డు సృష్టించినట్లు అధికారులు చెబుతున్నారు. అందులో 20,406 మంది గర్భిణులు, 20,021 మంది సాధారణ రోగులు ఈ సేవలు పొందారు. రేడియాలజీ సేవలు సైతం మెరుగుపడడంతో ఎక్కువ మంది పెద్దాస్పత్రి బాట పడుతున్నారు.

పెద్దాస్పత్రిలో 2022 ఏప్రిల్ నుంచి 23 ఏప్రిల్ వరకు అందించిన సేవలు

ఔట్ పేషెంట్	5,44,769
ఇన్‌పేషెంట్	64,697
అల్ట్రాసౌండ్	40,427
ఆపరేషన్లు (అన్నీ కలిపి)	18,919
ప్రసవాలు	8,161
ల్యాబ్ టెస్టులు	7,38,969
ఎక్స్‌రే	38,188
ఈసీజీ	24,854
సీటీ స్కాన్	6,069



సీటీ స్కాన్ నిర్వహించే గది

ఎక్స్‌రే, ల్యాబ్ టెస్టుల్లోనూ భేష్..

పెద్దాస్పత్రిలో రెండు, మూడేళ్ల నుంచి రోగుల తాకిడి ఎక్కువైంది. సరిహద్దు జిల్లాల వారికి కూడా దగ్గరలో ఉండటం, సేవలు మెరుగుపడడంతో ఎక్కువ మంది ఈ ఆస్పత్రి బాట పడతున్నారు. సాధారణ వైద్య సేవలకే కాకుండా ప్రసవాలు చేయించుకునేందుకు సైతం ఎక్కువ మంది మొగ్గు చూపిస్తున్నారు. దీంతో నిత్యం 1200 నుంచి 1500 మంది వరకు వైద్య సేవల కోసం వస్తున్నారు. ల్యాబ్, అల్ట్రా సౌండ్, సీటీ స్కాన్, టిఫా స్కాన్ వద్ద రోజూ భారీ క్యూ ఉంటోంది. ఏడాది కాలంగా పెద్దాస్పత్రికి 5 లక్షల మందికి పైగా వైద్య సేవలకు వచ్చారంటే ఇక్కడ ఎంత తాకిడి ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. ల్యాబ్ టెస్టులు ఏడాదిలో 7 లక్షల మందికి పైగా, ఖరీదైన సీటీ స్కాన్ కూడా 6 వేల మందికి నిర్వహించారు.

టిఫా స్కాన్‌కు తాకిడి..

గతేడాది నవంబర్‌లో రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ టిఫా స్కాన్ సేవలు ప్రారంభించారు. రెండు టిఫా మిషన్లు కేటాయించగా ఒక్కొక్కటి రూ.30 లక్షలకు పైగా విలువ ఉంటుంది. పెద్దాస్పత్రిలో టిఫా స్కాన్‌లు రికార్డు స్థాయిలో జరగడం గమనార్హం. కడుపులో బిడ్డ ఎదుగుదల, లోపాలను గుర్తించేందుకు ఈ స్కాన్ చేస్తారు. టిఫా స్కాన్ సేవల్లో ఈ ఆస్పత్రి రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచింది. సాధారణంగా ప్రతీ నెల 93 మంది గర్భిణులకు టిఫా స్కాన్ చేయడం లక్ష్యం కాగా, పెద్దాస్పత్రిలో అంతకు మించి జరగటం విశేషం. గత డిసెంబర్‌లో 112, జనవరిలో 100, ఫిబ్రవరిలో 154, మార్చిలో 199, ఏప్రిల్‌లో 189 మందికి టిఫా స్కాన్ చేశారు. ఈ స్కాన్‌కు తాకిడి పెరగడంతో ప్రణాళికాయుతంగా షెడ్యూల్ చెబుతూ గర్భిణులకు స్కాన్ చేస్తున్నారు. షెడ్యూల్ ప్రకారం చూస్తే ఇంకా 1,500 మంది టిఫా స్కాన్ కోసం రిజిస్టర్ చేయించుకున్నారు.

ఎన్టీఆర్‌కు మంత్రి పువ్వాడ ఘన నివాళి



ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్

ఖమ్మంమయూరిసెంటర్ : విశ్వవిఖ్యాత నట సార్వభౌమ, దివంగత మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు శత జయంతి సందర్భంగా హైదరాబాద్ ఫిల్మ్ నగర్‌లోని ఎన్టీఆర్ విగ్రహానికి రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తెలుగు రాష్ట్రాల్లోనే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా ఎన్టీఆర్ శత జయంతి వేడుకలు ఘనంగా జరుగుతున్నాయని అన్నారు. తెలుగు చలనచిత్ర పరిశ్రమలో ఉన్నత శిఖరానికి ఎదిగి, నటనలో తనదైన గుర్తింపు తెచ్చుకున్నారని, ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా పనిచేసి అన్ని రంగాల్లో తనదైన ముద్ర వేశారని కొనియాడారు. తెలుగు ప్రజలకు ఎన్టీఆర్ చేసిన సేవలు చిరస్మరణీయంగా నిలిచిపోతాయని అన్నారు.

రాష్ట్రపతిని ఆహ్వానించకపోవడం అవమానమే

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని



మాట్లాడుతున్న తమ్మినేని వీరభద్రం

ఖమ్మంమయూరిసెంటర్ : పార్లమెంట్ భవన ప్రారంభానికి రాష్ట్రపతిని ఆహ్వానించకపోవడం అవమానకరమైన విషయమని, ఎందుకు పిలవలేదో కేంద్ర ప్రభుత్వమే ప్రజలకు సమాధానం చెప్పాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. స్థానిక సుందరయ్య భవనంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్లమెంట్ ప్రారంభోత్సవంలో ప్రతిపక్షాలకు కూడా సరైన ప్రాధాన్యత ఇవ్వలేదని, 19 పార్టీలు బహిష్కరించినా ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ ప్రారంభించడం ఏంటని ప్రశ్నించారు. బీజేపీ, దాని వెనక ఉండి ప్రభుత్వాన్ని నడిపిస్తున్న ఆర్‌ఎస్‌ఎస్ ఈ దేశాన్ని మత రాజ్యంగా మార్చేందుకు కుట్ర చేస్తున్నాయని ఆరోపించారు. బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ మతతత్వ విధానాలను ఎండగట్టేందుకు కేడర్ సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. కర్ణాటకలో వలె దేశం నుంచి కూడా బీజేపీని తరిమేసే సమయం ఆసన్నమైందని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ఎండగడుతూ, స్థానిక సమస్యలపై ఉద్యమించాలని శ్రేణులకు సూచించారు. జూన్, జూలై నెలల్లో ప్రజా సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బండి రమేష్, బుగ్గవీటి సరళ, నాయకులు గుడవర్తి నాగేశ్వరరావు, షేక్ బషీరుద్దీన్, సుదర్శన్‌రెడ్డి, కొమ్ము శ్రీను, కె.వి.రెడ్డి, అంగిరేకుల నర్సయ్య, రామారావు, తోటకూర రాజు, గంగాధర్, పొన్నెకంటి సంగయ్య, కృష్ణ, నాగేశ్వరరావు, వీరన్న, సురేష్, కట్టికోల వెంకన్న, తమ్మినేని వెంకట్రావు, రంజాన్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



భానుడి భగభగ..

రోజురోజుకూ ఎండలు మండుతున్నాయి. జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఆదివారం హెచ్చరికల స్థాయిలో ఎండ తీవ్రత ఉండగా.. అనేక ప్రాంతాల్లో అప్రమత్తత స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. కూసుమంచి మండల కేంద్రంతో పాటు ఖమ్మం అర్బన్ మండలం ఖానాపురం పీఎస్ పరిధిలో అత్యధికంగా 45.1 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదు కాగా, ముదిగొండ మండలం పమ్మిలో 45 డిగ్రీలుగా ఉంది. మిగిలిన ప్రాంతాల్లోనూ 40 డిగ్రీలకు పైగానే ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఎండ వేడితో ప్రజలు తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. వడగాలులతో పిల్లలు, వృద్ధులు సతమతమయ్యారు. మధ్యాహ్నం వేళల్లో రహదారులన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి.

– ఖమ్మం వ్యవసాయం

అంచనాలు ఇప్పుడు.. మరమ్మతులు ఎప్పుడో ?

- సీజన్ ముంచుకొస్తున్నా పనులను గుర్తించని జలవనరుల శాఖ
- తాజాగా అంచనాల రూపకల్పనకు కసరత్తు
- అనుమతి లభించినా పనులు చేయడంపై అనుమానాలు



కాల్వను కమ్మేసిన కంప చెట్లు

ఖమ్మంఅర్బన్: వానాకాలం సీజన్ సమీపిస్తున్న తరుణంలో జల వనరుల శాఖ ప్రాజెక్టులు, చెరువులు, లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలకు సంబంధించి నిర్వహించాల్సిన మరమ్మతులపై ఇప్పుడు అంచనాలు తయారు చేస్తోంది. దీంతో అవి పూర్తయి.. నివేదికలు ఉన్నతాధికారులకు పంపించి.. నిధులు మంజూరై పనులు చేపట్టేది ఎప్పుడనే ప్రశ్న ఉత్పన్నం అవుతోంది. జిల్లాలో సాగర్ ఆయకట్టుతోపాటు 1400కు పైగా చెరువులు, మేజర్, మీడియం ప్రాజెక్టులతోపాటు, లిఫ్ట్ ఇరిగేషన్ పథకాల పరిధిలో సుమారు 6 లక్షల ఎకరాలకు పైగానే రైతులు సాగు చేస్తున్నారు. వాటి పరిధిలో నీటి సరఫరా సాగే క్రమంలో అంతరాయాలు లేకుండా సీజన్‌కు ముందుగా నే గుర్తించిన మరమ్మతులు పూర్తి చేస్తే వచ్చే సీజన్‌లో నీటి సరఫరాకు ఎలాంటి అడ్డంకులు ఉండవు. అయితే ప్రస్తుతం అంచనా దశలోనే ఉండటం, మరో 15రోజుల్లో వ్యవసాయ సీజన్ ప్రారంభం కావడంతో పాటు వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఒకవేళ నిధులు మంజూరైనా మరమ్మతులు నిర్వహించడం ప్రశ్నార్థకమే.

60 రకాల పనులకు మరమ్మతులు

జిల్లా వ్యాప్తంగా నాగార్జున సాగర్ పరిధిలో 17 మండలాల్లో 2.54 లక్షల ఎకరాల స్థిరీకరించిన ఆయకట్టు ఉంది. దీని పరిధిలో ప్రధాన కాల్వ, బ్రాంచ్ కాల్వలు, మేజర్లు, మైనర్ కాల్వలున్నాయి. వాటిలో తూములు, షట్టర్లు, లాకులు, యూటీలు, రెగ్యులేటర్లు తదితర వాటిలో చిన్న చిన్న మరమ్మతులతో పాటు కాంక్రీట్ పనులు ఉంటాయి. చెరువుల పరిధిలో బలహీన పడిన కట్టలను బలపర్చడం, చెరువుల అలుగులు, తూముల మరమ్మతు, కంపచెట్ల తొలగింపు తదితర పనులు చేయాల్సి ఉంటుంది. ఇవన్నీ కలిపి జిల్లా వ్యాప్తంగా 60కి పైగానే ఉంటాయని అంచనా. ఈ పనులకు సుమారు రూ.20 నుంచి రూ.25 కోట్ల వరకు ఖర్చవుతుందని అధికారులు ప్రాథమికంగా నివేదిక రూపొందించారు. అయితే ఆ నివేదిక ఇంతవరకు ఉన్నతాధికారులకు చేరనే లేదు. ఇప్పటి వరకు పంపిన సుమారు 10 పనులకు సంబంధించి రూ.3 కోట్ల నిధులు మంజూరయ్యాయని ఒక అధికారి తెలిపారు.

వర్షపు నీరు ఉండటంతో..

సాగర్ కాల్వలకు గత నెల 25 వరకు నీరు విడుదల కావడంతోపాటు అడపా దడపా పడుతున్న అకాల వర్షాలకు నీరు వచ్చి చేరడంతో మరమ్మతు చేయాల్సిన పనుల గుర్తింపులో జాప్యం జరిగినట్లు అధికారులు చెబుతున్నారు. గత నెల వరకు నీటి సరఫరాపైనే ఇంజనీర్లు ప్రత్యేక దృష్టి పెట్టారు. దీంతో మరమ్మతు పనులు గుర్తించడం, అంచనాలు తయారు చేయడం, ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపడం ఆలస్యమైనట్లు తెలుస్తోంది. దీనివల్ల నిధుల విడుదల జాప్యమయ్యే అవకాశం ఏర్పడింది.

గతేడాదీ ఇదే పరిస్థితి..

గత ఏడాది ఇదే తరహాలో ప్రధాన కాల్వ మరమ్మతులకు గురైంది. అయితే అక్కడ రిపేర్ చేయడం సాధ్యం కాక నీటి విడుదలను తగ్గించారు. దీంతో జిల్లాకు చేరాల్సిన రోజువారీ క్యూసెక్కుల నీరు తగ్గింది. ఈ కారణంగా జిల్లా ఆయకట్టుకు నీటిని అందించడానికి అధికారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సాగు చేసిన పంటలు ఎండిపోతున్నాయని రైతులు అగ్రహం వ్యక్తం చేస్తూ కార్యాలయాల ముందు, రోడ్లపై ఆందోళనలకు దిగారు. ఈ ఏడాది కూడా ఆలాంటి అత్యవసర మరమ్మతు పనులు సకాలంతో చేయకపోతే సాగు సమయంలో నిత్యం అంతరాయాలు ఏర్పడి నీటి సరఫరాలో ఇబ్బందులు తలెత్తే ప్రమాదం ఉంది.

పూడికలు, కంపచెట్లు ఈజీఎస్‌లోనే..

రైతులకు సాగు నీరందించే పంట కాల్వల మరమ్మతులకు ఈ దఫా ఎలాంటి అంచనాలు పంపవద్దని ఉన్నతాధికారులు సూచించినట్లు తెలిసింది. ఆ పనులన్నీ ఆయా ప్రాంతాల్లో ఉపాధి కూలీల ద్వారా చేయించుకుంటారని, కంపచెట్లు తొలగింపు, పూడికతీత తదితర పనులు ఈజీఎస్‌లోనే పూర్తవుతాయని, మిగిలిన నిర్మాణాలకు సంబంధించి, షట్టర్లు, క్రాస్ రెగ్యులేటర్లు, సిమెంట్ పనులు ఉంటేనే మంజూరు కోసం పంపాలని చెప్పినట్లు సమాచారం. అధికారులు ఆ పనులనే గుర్తించి అంచనాలు తయారు చేస్తున్నారు.

వాతావరణం అనుకూలించాలి..



మరమ్మతులకు సంబంధించి అంచనాలు కొన్ని పంపాం. కొన్ని మంజూరయ్యాయి. కొన్ని తయారు చేస్తున్నారు. ఈ నెలాఖరు నాటికి మొత్తం అంచనాలు వెళ్తాయి. నిధులు మంజూరు కాగానే సాధ్యమైనంత మేరకు పూర్తి చేయించడానికి ప్రయత్నిస్తాం. గత నెల వరకు నీటి సరఫరా సాగించడంతో అంచనాలకు జాప్యం కలిగింది. వర్షాలు వచ్చేలోగా పనులు గుర్తించి క్రమ పద్ధతి పూర్తి చేసేలా ప్రయత్నిస్తాం.

– శంకర్‌నాయక్, జలవలనరులశాఖ సీఈ

నేటి గ్రీవెన్స్ డే రద్దు

ఖమ్మం సహకారనగర్ : రాష్ట్ర అవతరణ దశాబ్ది వేడుకల సన్నాహక సమావేశం ఏర్పాటు చేస్తున్న నేపథ్యంలో సోమవారం ఐడీఓసీలో నిర్వహించే ప్రజావాణిని రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ వీపీ గౌతమ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అధికారులు సన్నాహక సమావేశంలో పాల్గొనాల్సి ఉన్నందున ఈ నిర్ణయం తీసుకున్నామని, ప్రజలు గమనించాలని కోరారు.

మా కాలేజీకి రండి!

- ప్రభుత్వ జూనియర్ కళాశాలల అధ్యాపకుల ప్రచారం
- ఆకట్టుకునేలా బ్రోచర్లు, ఫలితాల వివరాలతో రంగంలోకి..
- ఉచిత విద్య, సౌకర్యాలపై వివరిస్తూ ముందుకు...



బోనకల్ మండలం ముష్టికుంట్లలో ప్రచారం చేస్తున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు

ఖమ్మంసహకారనగర్: రాష్ట్ర ప్రభుత్వం ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సర ప్రవేశాలకు అవకాశం కల్పించిన నేపథ్యంలో జిల్లా ఇంటర్మీడియట్ అధికార యంత్రాంగం సన్నద్ధమవుతోంది. గతం కంటే విద్యార్థుల ప్రవేశాల సంఖ్యను పెంచేందుకు ఇప్పటి నుంచే ప్రయత్నాలు ముమ్మరం చేస్తోంది. ద్వితీయ సంవత్సర ఫలితాలు గతం కంటే కొంచెం మెరుగ్గా రావడంతో ఆ దిశగా అధికారులతో పాటు వివిధ కళాశాలల ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు ముందుకు సాగుతున్నారు.

ప్రథమ సంవత్సరంలో 10,032 సీట్లు..

ఇంటర్ ప్రథమ సంవత్సర ప్రవేశాల నమోదుకు ప్రభుత్వం రెండు రోజుల క్రితమే అవకాశం కల్పించింది. ఇటీవల పదో తరగతి ఫలితాలు రాగా.. ఆ విద్యార్థుల వివరాల ఆధారంగా తమ కళాశాలల్లో చేర్పించేందుకు అధ్యాపకులు ప్రయత్నాలు చేస్తున్నారు. అందుకు అనుగుణంగా ఇప్పటికే కళాశాలల్లో అందిస్తున్న సౌకర్యాలు, విద్యకు సంబంధించిన అంశాలపై కరపత్రాలను రూపొందించారు. జిల్లాలో 19 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మొత్తం 10,032 సీట్లు ఉన్నాయి. వీటిలో రెగ్యులర్‌గా 6,688 సీట్లు ఉండగా ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ గ్రూపులున్నాయి. ఒకేషనల్ కోర్సులకు 3,344 సీట్లు ఉండగా.. వీటిలో వివిధ రకాల కోర్సులకు అవకాశం ఉంది. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో చేరాలనుకునే వారు www.trbie.cff.gov.in లో పదో తరగతి హాల్ టికెట్ నంబర్ నమోదు చేయగానే విద్యార్థి సమస్త వివరాలు కనిపిస్తాయి. తర్వాత విద్యార్థి ఎక్కడ చదవాలనుకుంటే ఆ కళాశాలను ఎంపిక చేసుకొని చేరాల్సి ఉంటుంది.

క్షేత్రస్థాయిలోకి అధ్యాపకులు..

జిల్లాలో 19 ప్రభుత్వ జూనియర్ కళాశాలలున్నాయి. వీటి పరిధిలో గతేడాది 3300 మంది విద్యార్థులు మాత్రమే చేరారు. ఈ ఏడాది విద్యార్థుల సంఖ్య పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఉచిత ప్రవేశాలు, ఉచిత విద్య, ఉచిత పాఠ్య పుస్తకాలు, నాణ్యమైన బోధన, అర్హులైన విద్యార్థులందరికీ ఉపకార వేతనాలు, విశాలమైన గదులు, ఆట స్థలాలు, బస్ పాస్ సౌకర్యం ఇలా ప్రధాన అంశాలను అజెండాగా తీసుకుని ప్రచారం చేస్తున్నారు. ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ కళాశాలల్లో ఫలితాలు వస్తున్నాయనే అంశాన్ని సైతం విద్యార్థులు, తల్లిదండ్రుల దృష్టికి తీసుకెళ్తున్నారు. ఈ ఏడాది ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో నగరంలోని ఏఎస్‌ఆర్ (శాంతినగర్) జూనియర్ కళాశాల విద్యార్థిని రాష్ట్రస్థాయిలో ప్రభుత్వ కళాశాలల తరఫున ప్రథమ స్థానంలో నిలవగా.. జిల్లాలోని పలు కళాశాలల విద్యార్థులు సైతం రాష్ట్రస్థాయిలో మంచి మార్కులు సాధించారు. ఇలాంటి అంశాలను వివరిస్తూ ప్రచారం చేయడం ద్వారా ప్రవేశాల సంఖ్య పెరిగే అవకాశం ఉందని అధ్యాపకులు చెబుతున్నారు.


జిల్లాలోని కళాశాలలు, సీట్ల వివరాలిలా

ప్రభుత్వ జూనియర్ కళాశాలలు	19
అన్ని కోర్సుల్లో సీట్లు	10,032
రెగ్యులర్ కోర్సుల్లో	6,688
ఒకేషనల్ కోర్సుల్లో	3,344



ఏఎస్‌ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో కల్పిస్తున్న సౌకర్యాలతో రూపొందించిన బ్రోచర్

సద్వినియోగం చేసుకోవాలి



పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఇంటర్మీడియట్‌కు ప్రభుత్వ కళాశాలల్లో చేరాలని కోరుతున్నాం. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించటంతో పాటు సౌకర్యాలు కల్పిస్తోంది. ఒత్తిడి లేని విద్యతో రాష్ట్రస్థాయి మార్కులు సాధించేలా కృషి చేస్తున్నాం. ఉచిత పాఠ్య పుస్తకాలు, ఉచిత విద్య, విద్యార్థులకు ప్రత్యేక తరగతులు, ఎంసెట్ పరీక్షకు శిక్షణ ఇస్తున్నాం. అనుభవజ్ఞులైన అధ్యాపకులు ప్రభుత్వ కళాశాలల్లోనే ఉన్నారు. అధిక మంది విద్యార్థులు రాష్ట్రస్థాయిలో సైతం మార్కులు సాధించారు. వీటన్నింటిని దృష్టిలో ఉంచుకొని విద్యార్థులు ప్రభుత్వ కళాశాలల్లోనే చేరాలి.

– కె.రవిబాబు, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి

క్లుప్తంగా

డిగ్రీ ప్రథమ సంవత్సర ప్రవేశాలకు కౌన్సెలింగ్

కొణిజర్ల: మండలంలోని తనికెళ్ల గ్రామంలో ఉన్న తెలంగాణ గిరిజన గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో డిగ్రీ ప్రథమ సంవత్సరంలో చేరాలనుకునే బాలికలకు కౌన్సెలింగ్ నిర్వహించనున్నామని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.ఉమాదేవి తెలిపారు. టీజీయూజీసెట్‌లో అర్హత పొందిన వారు మొదటి దఫా ప్రవేశాలకు అర్హులని, బీఎస్సీ, బీఎస్సీ(బీజెడ్‌సీ), బీకామ్, బీఏ కోర్సుల్లో చేరాలనుకునే విద్యార్థినులు జూన్ 1 నుంచి 12 వరకు అన్ని ఒరిజనల్ ధ్రువీకరణ పత్రాలు, టెన్త్, ఇంటర్ మార్కుల జాబితా, టీజీయూజీసెట్ హాల్ టికెట్, ర్యాంకు కార్డ్, ఆదాయ కుల ధ్రువీకరణ పత్రాలు, ఆధార్ కార్డు, కండక్ట్ ధ్రువీకరణ పత్రాలు, 5 పాస్ పోర్టు సైజ్ ఫొటోలతో కళాశాలకు హాజరు కావాలని సూచించారు. పూర్తి వివరాలకు 99517 55806, 83328 64686 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

అలరించిన సినీ సంగీత విభావరి



నివాళులర్పిస్తున్న దృశ్యం

ఖమ్మంగాంధీచౌక్: స్థానిక భక్తరామదాసు కళాక్షేత్రంలో ఆదివారం నిర్వహించిన సంగీత విభావరి అలరించింది. పద్మశ్రీ నందమూరి తారక రామారావు శత జయంతితో పాటు కళాభిమాని షేక్ జానీమియా సంస్మరణ దినోత్సవం సందర్భంగా జరిగిన సంగీత విభావరిలో అలనాటి మధుర గీతాలను ఆలపించారు. కార్యక్రమంలో యాదగిరి, మాధవరావు, వి.వి. రెడ్డి, ఇజ్రాయెల్, లక్ష్మణమూర్తి, ఇమామ్, సుధాకర్, విద్యాసాగర్ పాల్గొన్నారు.

చిన్నారిపై లైంగికదాడికి యత్నం

ఖమ్మంరూరల్: మండలంలోని ఓ గ్రామంలో ఆరేళ్ల చిన్నారిపై అదే గ్రామానికి చెందిన వ్యక్తి లైంగికదాడికి యత్నించాడు. పోలీసుల కథనం ప్రకారం.. ఇంట్లో ఒంటరిగా ఉన్న బాలికపై అదే గ్రామానికి చెందిన వ్యక్తి లైంగికదాడి చేసేందుకు యత్నించగా బాలిక ఏడుపులు విని చుట్టుపక్కల వారు వచ్చారు. సదరు వ్యక్తిని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

బోనకల్: మండలంలోని ముష్టికుంట్ల గ్రామ సమీపంలోని లింగాల మైనర్ కాలువ పక్కన వ్యవసాయ బావి వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం ఆదివారం లభ్యమైంది. ఆ వ్యక్తి నలుపు, తెలుపు చారలు గల టీషర్ట్, గ్రే కలర్ లోయర్ ధరించి ఉన్నాడు. 3 రోజుల కిందటే మృతి చెందడంతో మృతదేహం కుళ్లిపోయి దుర్వాసన వెదజల్లుతోంది. సమీప పొలాల్లో ఉన్న రైతులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ కవిత తెలిపారు. మృతి చెందిన వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడా? లేదా హత్యచేసి ఎవరైనా పడేశారా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

భారీగా గంజాయి స్వాధీనం



నిందితులు వదిలేసిన కారు

భద్రాచలంఅర్బన్: పట్టణంలో వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులకు భారీగా గంజాయి పట్టుబడింది. వివరాలిలా ఉన్నాయి.. శనివారం రాత్రి నుంచి పట్టణంలోని కూనవరం రోడ్డులో పోలీసులు విస్తృత తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత ట్రాక్టర్‌ను ఆపి తనిఖీ చేయగా 500 కేజీల గంజాయి పట్టుబడింది. ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారించగా మరో వాహనంలో కూడా గంజాయిని తరలిస్తున్నారనే సమాచారం తెలిసింది. అప్రమత్తమైన పోలీసులు అక్కడే తనిఖీలు ముమ్మరం చేశారు. ఈ క్రమంలో కూనవరం రోడ్డులోని ఓ పెట్రోల్ బంక్‌లో కొందరు వ్యక్తులు కారును వదిలేసి వెళ్లినట్లు తెలుసుకున్న పోలీసులు అక్కడికి వెళ్లి కారును క్షుణ్ణంగా పరిశీలించారు. అందులో ఆడవారి దుస్తులు విక్రయించినట్లు డబ్బాలను అమర్చి అలాంటి డబ్బాల్లోనే గంజాయి నింపి ఉంచారు. వెంటనే గంజాయిని స్వాధీనం చేసుకుని వాహనాన్ని సీజ్ చేశారు. కాగా, కారులో 450 కేజీల గంజాయి ఉన్నట్లు సమాచారం. కొన్ని గంటల వ్యవధిలోనే పోలీసులు దాదాపు 1000 కేజీల గంజాయిని పట్టుకున్నారు. కారును వదిలేసి పారిపోయిన నిందితుల కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. అయితే, సదరు కారు పట్టణంలోని మెడికల్‌కాలనీకి చెందిన వ్యక్తిదని తేలినట్లు విశ్వసనీయ సమాచారం. అయితే, ట్రాక్టర్‌లో పట్టుబడిన నిందితులు చెప్పిన వాహనం ఈ కారేనా? లేదా మరో వాహనంలో గంజాయి తరలిపోయి ఉంటుందా? అనే అంశాలపై స్పష్టత రావాల్సి ఉందని ఓ పోలీస్ అధికారి తెలిపారు.

ఇసుక అక్రమ రవాణాపై కొరడా

- మధిరలో పదుల సంఖ్యలో ఇసుక ట్రాక్టర్ల స్వాధీనం
- టౌన్ ఎస్‌ఐ సెలవులో ఉన్నప్పుడే పట్టుబడిన ట్రాక్టర్లు !



పోలీసులు సీజ్ చేసిన ఇసుక ట్రాక్టర్లు

మధిర: మధిర మీదుగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను పదుల సంఖ్యలో పోలీసులు ఇటీవల సీజ్ చేశారు. ఇటీవల టౌన్ ఎస్‌ఐ మూడురోజులపాటు సెలవులో వెళ్లారు. అడిషనల్ ఎస్‌ఐ స్వప్న చార్జ్ తీసుకున్నారు. సీఐ ఆదేశాలతో ఇసుక అక్రమ రవాణాపై కొరడా ఝులిపించారు. ఈ క్రమంలోనే ఇసుక ట్రాక్టర్లను సీజ్ చేశారు. కొన్నాళ్లుగా రాత్రి, పగలు తేడా లేకుండా అక్రమంగా ఇసుక రవాణా అవుతోందని స్థానికులు, వివిధ పార్టీల నేతలు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదనే ఆరోపణలు ఉన్నాయి. ఇంతలోనే ట్రాక్టర్లు పట్టుబడడంతో.. ఇన్నాళ్లు ఇసుక అక్రమ రవాణాకు పోలీసుల్లో కొందరు సహకరించారా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఫిర్యాదులపై చర్యలు శూన్యం

మధిర టౌన్ ఎస్‌ఐ ఇటీవల మూడు రోజుల పాటు సెలవులో వెళ్లారు. దీంతో అడిషనల్ ఎస్‌ఐ స్వప్న చార్జ్ తీసుకున్నారు. ఆ సమయంలో వరుసగా ఇసుక ట్రాక్టర్లను సీజ్ చేయడం గమనార్హం. కొద్ది నెలలుగా ఇసుక అక్రమ రవాణాపై ఫిర్యాదు చేస్తే ఎవరూ పట్టించుకోలేదు. చివరకు రాయపట్నం సర్పంచ్ సుశీల ఇసుక రేవుకు ట్రాక్టర్లు వెళ్లకుండా జేసీబీతో రహదారికి గండి కొట్టించినా రవాణా ఆగలేదు. దీనికి తోడు చింతకాని మండలం నాగులవంచకు చెందిన దళితబంధు లబ్ధిదారుడి నుంచి ట్రాక్టర్‌ను రాయపట్నంకు చెందిన వ్యక్తి లీజ్‌కు తీసుకొని అక్రమ ఇసుక రవాణాకు వినియోగిస్తున్నాడని తెలిసినా స్పందన లేదు. వందలాది ట్రాక్టర్లతో రవాణా జరుగుతుండగా ప్రతీ ట్రాక్టర్ నుంచి ఓ పోలీసు అధికారి మామూళ్లు వసూలు చేస్తున్నారనే ప్రచారం సాగింది. ఇంతలోనే టౌన్ ఎస్‌ఐ సెలవులో వెళ్లడం, బాధ్యతలు స్వీకరించిన అడిషనల్ ఎస్‌ఐ స్వప్న.. సీఐ మురళి ఆదేశాలతో రంగంలోకి దిగి ట్రాక్టర్లను సీజ్ చేయడంపై సర్వత్రా చర్చనీయాంశమైంది.

ఆరోపణల వెల్లువ

టౌన్ ఎస్‌ఐ తీరుపై కొన్నాళ్లుగా విమర్శలు ఉన్నాయి. సిద్దినేనిగూడెం గ్రామానికి చెందిన యువకుడిని ఈ నెల 1వ తేదీన గుర్తుతెలియని వ్యక్తి పట్టపగలు కత్తితో బెదిరించి సదరు వ్యక్తి వాహనాన్ని అపహరించాడు. అదేరోజు బాధితుడు ఫిర్యాదు చేయగా, సీసీ పుటేజీల్లో నిందితుడిని గుర్తించి పట్టుకోవడంలో కానీ, కేసు నమోదు చేయడంలో కానీ ఆసక్తి చూపలేదనే ఆరోపణలున్నాయి. ఇక తనకు ప్రయోజనం కలిగే పనులు, అధికార పార్టీ నేతలు చెప్పిన పనులే చేస్తారని.. ఇదే క్రమంలో తన బదిలీ కూడా నిలిపివేయించుకున్నారనే విమర్శలు వచ్చాయి. అలాగే, పెట్రోలింగ్ కొరవడటంతో పట్టణం చుట్టూ ఖాళీస్థలాల్లో సాయంత్రమైతే అసాంఘిక కార్యకలాపాలు సాగుతున్నాయని ప్రజలు వాపోతున్నారు.

పెట్రోలింగ్ ముమ్మరం చేస్తాం..

ఇసుక అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టి సారించాం. అనుమతులు లేకుండా ట్రాక్టర్లలో ఇసుక తరలిస్తే చర్యలు చేపడుతాం. ద్విచక్రవాహనం చోరీ విషయం నా దృష్టికి రాలేదు. పట్టణంలో అసాంఘిక కార్యకలాపాలను అరికట్టేందుకు పెట్రోలింగ్ ముమ్మరం చేస్తాం.

– ఒడ్డేపల్లి మురళి, సీఐ

శస్త్రచికిత్సతో బ్రెయిన్ ట్యూమర్ తొలగింపు..

దాతల సాయంతో బిడ్డ ప్రాణం నిలిచిందని తల్లిదండ్రుల హర్షం

సాక్షి ఎఫెక్ట్..



ఆపరేషన్ అనంతరం చికిత్స పొందుతున్న క్రిష్టోఫర్

పెనుబల్లి: బ్రెయిన్ ట్యూమర్‌తో బాధపడుతున్న బాలుడు క్రిష్టోఫర్‌కు హైదరాబాద్ యశోద ఆస్పత్రి వైద్యులు విజయవంతంగా శస్త్రచికిత్స నిర్వహించారు. తమ బిడ్డ ప్రాణాలతో బయటపడ్డాడని తల్లిదండ్రులు ఆనందోత్సాహాల్లో మునిగి తేలుతున్నారు. ఖమ్మం జిల్లా పెనుబల్లి మండలం గంగదేవిపాడు గ్రామానికి చెందిన ఆర్‌ఎంపీ సానిక చెన్నారావు, వనజ దంపతుల పెద్ద కుమారుడు అభిషేక్ బ్రెయిన్ ట్యూమర్‌తో చికిత్స పొందుతూ మృతి చెందాడు. డాక్టర్ల సలహా మేరకు చిన్న కుమారుడు క్రిష్టోఫర్‌కు వైద్య పరీక్షలు చేయించగా అతడికి కూడా బ్రెయిన్ ట్యూమర్ ఉన్నట్లు తేలింది. పెద్ద కుమారుడి వైద్యం కోసం ఉన్న పొలం అమ్మడంతో పాటు అప్పులు చేసి వైద్యం చేయించినా ఫలితం దక్కలేదు. చిన్న కుమారుడు క్రిష్టోఫర్‌ను ఎలాగైనా బతికించుకోవాలని ఆశతో ఉన్న క్రమంలో ఏప్రిల్ 18న 'మా బిడ్డకు బతుకునివ్వండి' శీర్షికన 'సాక్షి' దినపత్రికలో కథనం ప్రచురితమైంది. దీంతో పలువురు దాతలు ముందుకు వచ్చి ఆర్థిక సాయం చేశారు. రూ.5 లక్షల నిధులు సమకూరగా హైదరాబాద్ యశోద ఆసుపత్రిలో క్రిష్టోఫర్‌ను చేర్చారు. వైద్యులు శస్త్రచికిత్స విజయవంతంగా నిర్వహించినట్లు ఆదివారం ప్రకటించారు. పెద్ద కొడుకును కోల్పోయిన తమకు దాతల సాయంతో చిన్న కుమారుడు దక్కాడని తల్లిదండ్రులు తెలిపారు. 'సాక్షి' దినపత్రికకు, దాతలకు బాలుడి తల్లిదండ్రులు చెన్నారావు, వనజ దంపతులు కృతజ్ఞతలు తెలిపారు.

ఆర్టీసీ బస్సులో పొగలు



బస్సు నుంచి వెలువడుతున్న పొగ

అశ్వారావుపేటరూరల్: ఆర్టీసీ బస్సులో అకస్మాత్తుగా పొగలు వ్యాపించిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. వివరాలిలా... భద్రాచలం నుంచి రాజమండ్రి వెళ్తున్న ఆర్టీసీ బస్సు అశ్వారావుపేట బస్టాండ్‌కు వచ్చింది. అయితే, ఒక్కసారిగా బస్సులో దట్టమైన పొగలు రావడంతో ప్రయాణికులు భయాందోళనకు గురయ్యారు. ఆ సమయంలో బస్‌లో మొత్తం 35 మంది ప్రయాణికులున్నారు. అప్రమత్తమైన డ్రైవర్ వెంకటేశ్వరరావు బస్టాండ్‌లోని ఆర్టీసీ సిబ్బందితో కలిసి పొగలను అదుపు చేశారు. ఎండవేడికి వైర్లు వేడెక్కి పొగలు వచ్చాయని భయపడాల్సిన అవసరం లేదని డ్రైవర్ ప్రయాణికులకు ధైర్యం చెప్పడంతో ఊపిరి పీల్చుకున్నారు. ఇంజన్ చల్లబడిన తర్వాత వైర్లకు మరమ్మతులు చేసి ప్రయాణికులను తీసుకొని బస్సు రాజమండ్రి బయలుదేరింది.

రైతులు, యువతను విస్మరిస్తున్న పాలకులు



మాట్లాడుతున్న పోటు ప్రసాద్

ఖమ్మంమయూరిసెంటర్: రైతులు, యువతను పాలకులు విస్మరిస్తున్నారని సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ ఆరోపించారు. ప్రధానమైన వ్యవసాయ రంగం సంక్షోభంలోకి కూరుకుపోవడం వల్లే గ్రామీణ ప్రాంతాభివృద్ధి దెబ్బతిని ఆర్థిక ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. సీపీఐ అనుబంధ ప్రజా సంఘాల సంయుక్త సమావేశం ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగగా పోటు ప్రసాద్ పాల్గొని మాట్లాడారు. వ్యవసాయ రంగ సబ్సిడీలను పూర్తిగా ఎత్తివేశారని, వ్యవసాయ రంగం సంక్షోభంలోకి కూరుకుపోతుంటే కార్పొరేట్లకు రూ.కోట్ల రాయితీలు ప్రకటిస్తూ వారి సేవలో తరిస్తున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం సైతం ఇచ్చిన హామీలను విస్మరిస్తోందని విమర్శించారు. జూన్ 4న కొత్తగూడెంలో జరిగే ప్రజాగర్జన సభకు వేలాదిగా తరలి రావాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు శింగు నర్సింహారావు, తాటి వెంకటేశ్వరరావు, రావి శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో యాచకుడి మృతి



సగ్గుర్తి శ్రీనివాసరావు మృతదేహం

మధిర: మధిర రైల్వే స్టేషన్ రెండో నంబర్ ప్లాట్‌ఫాంపై ఆదివారం ఓ వ్యక్తి అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందాడు. ఎన్టీఆర్ జిల్లా తిరువూరు మండలం రోలుపడి గ్రామపంచాయతీ రాజీవ్‌నగర్‌కాలనీకి చెందిన సగ్గుర్తి శ్రీనివాసరావు (50) కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. నిరుపేద కావడంతో రైలు బండిలో భిక్షాటన చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో ఆదివారం మధిర రైల్వే స్టేషన్ రెండో నంబర్ ప్లాట్‌ఫాంపై మృతి చెంది ఉన్నాడు. ఈ ఘటనపై రైల్వే హెడ్ కానిస్టేబుల్ వేణుగోపాల్ రెడ్డి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మధిర ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

చికిత్స పొందుతూ మహిళ...

కారేపల్లి: కుటుంబ కలహాల నేపథ్యంలో పురుగులమందు తాగిన మహిళ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందిన ఘటన మండలంలోని గుంపెళ్లగూడెం గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ధరావత్ సునీత (28)కు తన భర్త మహేశ్‌తో ఈ నెల 26న వాగ్వాదం జరిగింది. దీంతో సునీత పురుగులమందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను ఖమ్మం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. కారేపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతున్న యువకుడు...

తల్లాడ: మండలంలోని అన్నారుగూడెం గ్రామంలో పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకొన్న యువకుడు చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. తల్లాడ పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన తాళ్ల వివేక్(20) ఈ నెల 21న బిల్లుపాడు – అన్నారుగూడెం ఎన్ఎస్‌పీ కాల్వ రోడ్డులో పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకున్నాడు. అతడిని కుటుంబ సభ్యులు ఖమ్మంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఏఎస్‌ఐ జేవీఆర్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

యువత రాజకీయాల్లోకి రావాలి..



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

వైరా: రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ నియోజకవర్గాలలో యువత పెద్ద ఎత్తున రాజకీయాల్లోకి రావాలని డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గా ప్రసాద్ కోరారు. వైరా నియోజకవర్గ స్థాయి కాంగ్రెస్ లీడర్‌షిప్ డెవలప్‌మెంట్ మిషన్ కార్యక్రమాన్ని ఆదివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. యువత రాజకీయాల్లోకి రావాలనే ఉద్దేశంతో ఎల్‌డీఎం కార్యక్రమాన్ని ప్రవేశపెట్టామని తెలిపారు. ఎల్‌డీఎం కోఆర్డినేటర్ మద్దినేని రమేశ్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ యువతను నాయకులుగా తీర్చిదిద్దడమే ఎల్‌డీఎం ఉద్దేశమని పేర్కొన్నారు. అనంతరం కార్యక్రమానికి సంబంధించి పోస్టర్లు ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మాలోత్ రాందాస్‌నాయక్, బొడ్డు బొందయ్య, హుస్సేన్, శేఖర్‌గౌడ్, దానియేలు, కృష్ణప్రసాద్, వెంకటనర్సిరెడ్డి, నరేందర్, చంద్రప్రకాశ్, సీతారాములు, కృష్ణారావు, అశోక్, రోశయ్య, మురళి, నరసింహారావు, శ్రీను, హరినాథ్, కొండలు, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

దగ్ధమైన భైరవునిపల్లి గుట్ట



కాలుతున్న భైరవునిపల్లి గుట్ట

నేలకొండపల్లి: మండలంలోని భైరవునిపల్లి గుట్ట ప్రమాదవశాత్తు దగ్ధమైంది. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని భైరవునిపల్లి సమీపంలో ఉన్న గుట్ట ఆదివారం అగ్నికి ఆహుతైంది. గుట్ట పక్కన రైతు వరి కొయ్యలు దహనం చేసేందుకు నిప్పంటించాడు. దీంతో గాలులకు మంటలు గుట్ట పైకి వ్యాపించాయి. గుట్ట మీద ఉన్న చెట్లు, గడ్డి కాలిపోయాయి. మంటలు మరో పక్కకు వ్యాపిస్తున్న తరుణంలో గుట్ట కింది భాగంలో కొంత తడి ఉండటంతో మంటలు ఊరి వైపు రాకుండా ఆరిపోయాయి. లేనిపక్షంలో పెను ప్రమాదం జరిగేదని పలువురు ఆందోళన చెందారు.

సుబాబుల్ తోట దగ్ధం

మధిర: మండలంలోని మల్లవరం గ్రామానికి చెందిన, బీజేపీ మధిర నియోజకవర్గ కన్వీనర్ ఏలూరి నాగేశ్వరరావుకు చెందిన రెండు ఎకరాల సుబాబుల్ తోట శనివారం రాత్రి అగ్నికి ఆహుతైంది. ఇటీవలే సుబాబుల్ కర్రను కొట్టి మిల్లులకు పంపించారు. మళ్లీ కర్రను పెంచేందుకు పొలాన్ని తయారు చేశారు. ఈ తరుణంలో గుర్తుతెలియని వ్యక్తులు సుబాబుల్ తోటకు నిప్పంటించారు. ఈ విషయాన్ని తెలుసుకున్న బీజేపీ నాయకులు ఆదివారం పొలాన్ని పరిశీలించారు.



కాలిబూడిదైన సుబాబుల్ తోట

జామాయిల్ తోట దగ్ధం



కాలి బూడిదైన జామాయిల్ తోట

కల్లూరురూరల్: మండలంలోని చిన్నకోరుకొండి గ్రామంలోని జామాయిల్‌తోట దగ్ధమైంది. ఒక ఎకరం వరి పొలంలో ఉన్న వరిగడ్డి కూడా దగ్ధమైంది. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన రెడ్డి లక్ష్మయ్యకు చెందిన నాలుగు ఎకరాలు, రెడ్డి వెంకటేశ్వర్లుకు చెందిన రెండు ఎకరాల జామాయిల్ తోటతోపాటు సీతాల సుబ్బయ్యకు చెందిన రెండు ఎకరాల మామిడి తోట పక్కనే సీతాల రాంబాబుకు చెందిన ఎకరం పొలంలోని వరిగడ్డి అగ్నికి ఆహుతైంది. శనివారం అర్ధరాత్రి జామాయిల్ తోటలో అగ్గి రాజుకుని మంటలు వ్యాపించాయి. కొందరు రైతులు గమనించి సంబంధిత రైతులకు సమాచారం అందించారు. సకాలంలో ఫైర్‌ఇంజన్లు రాకపోవటంతో అప్పటికే చీకటి కావటంతో రైతులు మంటలను ఆర్పేందుకు ఎలాంటి ప్రయత్నం చేయలేక పోయారు. మరికొన్ని రోజుల్లో జామాయిల్ కలప నరికి భద్రాచలం పేపర్ బోర్డుకు తరలించాలని రైతులు ఏర్పాట్లు చేసుకుంటున్న తరుణంలో ఈ ఘటన వారి కుటుంబాల్లో విషాదం నింపింది.

వైద్య సేవలపై ఆరా..

- భద్రాచలం ఏరియా ఆస్పత్రిని సందర్శించిన కేంద్ర బృందం
- వైద్యులు, అధికారులకు అవగాహన కార్యక్రమం



ప్రభుత్వ పథకాలపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇస్తున్న కేంద్ర బృందం సభ్యులు

భద్రాచలంఅర్బన్: భద్రాచలం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో వైద్య సేవలపై కేంద్ర బృందం ఆరా తీసింది. ఏజెన్సీ ప్రాంతమైన భద్రాచలంలో గిరిజనులకు వైద్యం అందుతున్న తీరు, కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు, పథకాలపై అవగాహన కార్యక్రమాల గురించి తెలుసుకుంది. నేషనల్ హెల్త్ సిస్టమ్స్ రిసోర్స్ సెంటర్ (ఎన్‌హెచ్‌ఎస్‌ఆర్‌సీ) బృందం ఆదివారం భద్రాచలం ప్రభుత్వ ఆస్పత్రిని సందర్శించింది. బృందంలో అడ్వైజర్ డాక్టర్ బాలసుబ్రమణ్యంతోపాటు డాక్టర్ అనంత్ కుమార్, డాక్టర్ షాహిద్ అలీ, డాక్టర్ సంజీవ్ కుమార్ గుప్తా, డాక్టర్ హరికృష్ణ, డాక్టర్ అనంత పద్మనాభ భట్, డాక్టర్ జవహర్ తదితరులు ఉన్నారు. దేశవ్యాప్తంగా ప్రభుత్వ ఆస్పత్రుల అభివృద్ధి, మొబిలైజేషన్, టెక్నికల్ అసిస్టెన్స్ తదితర అంశాలలో 2007 నుంచి కేంద్ర వైద్య ఆరోగ్య శాఖతో కలిసి ఈ సంస్థ సహకారం అందిస్తోంది. ఈ క్రమంలో జిల్లాలో గడిచిన ఐదేళ్లలో కేంద్ర ప్రభుత్వ నిధులతో నిర్మించిన భవనాలు, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ తదితర అంశాలను పరిశీలించేందుకు వచ్చారు. 11 మందితో కూడిన ఈ బృందంలో కేంద్ర ప్రభుత్వ అధికారులతోపాటు రాష్ట్ర ప్రభుత్వ అధికారులు కూడా ఉన్నారు. తొలుత భద్రాచలం ఆస్పత్రిలో డీఎంహెచ్‌ఓ జేవీఎల్ శిరీష అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ నిర్వహించారు. స్థానిక వైద్యులతోపాటు జిల్లా అధికారులకు అవగాహన కల్పించారు. ఆస్పత్రిలో గిరిజనులకు వైద్యం అందుతున్న తీరును పరిశీలించారు. పేదలకు ఉచితంగా వైద్యం అందించాలని, సరైన సమయంలో చికిత్స అందేలా చూడాలని వైద్యులకు సూచించారు. మరో 3 రోజులు జిల్లాలో పర్యటించనున్న ఈ బృందం సభ్యులు కేంద్ర ప్రభుత్వ నిధులతో కల్పించిన సదుపాయాలను పరిశీలించనున్నారు. కేంద్ర బృందానికి తొలుత డీఎంహెచ్‌ఓతోపాటు జిల్లా ఆస్పత్రుల సమన్వయకర్త డాక్టర్ రవిబాబు నాయక్, భద్రాచలం ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రామకృష్ణ ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారులు, సిబ్బంది సుకృత, రాజ్‌కుమార్, రాజశేఖర్ రెడ్డి, సంతోష్, మణికంఠారెడ్డి, బాలాజీ, చైతన్య, ఇమ్మానుయేల్, దుర్గ, మోహన్, విజయకుమారి, భద్రు, వీసాల కృష్ణయ్య, పాల్గొన్నారు.

పాలనలో నయా పంథా

సంస్కరణలతో విప్లవాత్మక మార్పులు

- పల్లె, పట్టణ ప్రజల చెంతకే ప్రభుత్వ సేవలు, పథకాలు
- దేశ చరిత్రలోనే తొలిసారిగా 15,004 గ్రామ, వార్డు సచివాలయాల వ్యవస్థ
- వాటిలో కొత్తగా 1.34 శాశ్వత ఉద్యోగాల భర్తీ
- ప్రతి 50 ఇళ్లకు ఒక వలంటీర్ చొప్పున సేవా వ్యవస్థ
- నవరత్నాల పథకాల ద్వారా రూ.2.11 లక్షల కోట్లు ప్రజల ఖాతాల్లో జమ



సాక్షి, అమరావతి: కేవలం నాలుగేళ్లలోనే సంస్కరణల ద్వారా పరిపాలన వ్యవస్థలో విప్లవాత్మక మార్పులకు రాష్ట్రం చిరునామాగా మారింది. సామాజిక బాధ్యతగా విద్య, వైద్యం, వ్యవసాయం, సంక్షేమ రంగాల్లో అందించాల్సిన సేవల్లో ప్రభుత్వం తీసుకొచ్చిన మార్పులు, సంస్కరణలు సత్ఫలితాలిస్తున్నాయి. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు పాలనా వ్యవస్థల్లో మార్పులు కొట్టొచ్చినట్లు కనిపించేలా చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సర్కారుకే దక్కుతుంది. గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని, 73వ రాజ్యాంగ సవరణ ద్వారా స్థానిక సంస్థలకే అధికారాలు, విధులు అప్పగించాలనే మాటలను సాక్షాత్కరింప చేసిన ఏకైక రాష్ట్రంగా నిలిచింది ఏపీనే. గ్రామ, వార్డు సచివాలయాల వ్యవస్థను ఏర్పాటు చేసి.. పల్లె, పట్టణ ప్రజల చెంతకే ప్రభుత్వ సేవలు, పథకాలను అందిస్తోంది. అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదే (2019) కొత్త వ్యవస్థలను ఏర్పాటు చేసి, చేతులు దులుపుకోకుండా.. ఆ వ్యవస్థల ద్వారా ప్రభుత్వ సేవలు, పథకాలు అందించడానికి అవసరమైన మౌలిక సదుపాయాలతో పాటు ఉద్యోగులు, సిబ్బందిని భర్తీ చేసింది. దేశ చరిత్రలోనే తొలిసారిగా 15,004 గ్రామ, వార్డు సచివాలయాలతో పక్కా వ్యవస్థ ఏర్పాటు చేసింది. వీటిలో 1.34 లక్షల శాశ్వత ఉద్యోగాలను కొత్తగా సృష్టించి.. భర్తీ చేసింది. ప్రతి 50 ఇళ్లకు ఒక వలంటీర్ చొప్పున ప్రజల చేయి పట్టుకుని నడిపించే సేవా వ్యవస్థను తీసుకొచ్చింది. గ్రామ, వార్డు సచివాలయాలతో అనుసంధానమై 2.65 లక్షల మంది వలంటీర్లుగా గ్రామాల్లో పని చేస్తున్నారు. తద్వారా 600 పౌర సేవలు ఎటువంటి లంచాలు, వివక్షకు తావు లేకుండా అందుతున్నాయి. మారుమూల పల్లెల్లో సైతం ఎక్కడ చూసినా పౌర సేవల్లో గొప్ప విప్లవం కళ్లకు కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది.

ఉన్న ఊరిలోనే ప్రభుత్వ సేవలు

ప్రజలు పనుల నిమిత్తం మండల కేంద్రాలు, జిల్లా కేంద్రాలకు తిరగాల్సిన అవసరం లేకుండా ఉన్న ఊరిలోనే ప్రభుత్వ సేవలు, పథకాలు అందుతున్నాయి. దీంతో గతంలో ఎక్కడకో వెళ్లి దరఖాస్తు చేయడం, రాజకీయ నేతల చుట్టూ తిరగడం, లంచాలు ఇవ్వడం.. ఇలాంటి కష్టాలన్నింటికీ బ్రేక్ పడింది. ఉన్న ఊరిలో గ్రామ, వార్డు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకుంటే అర్హత ఉంటే చాలు.. ఎవరి సిఫార్సు లేకుండానే సేవలు, పథకాలు అందుతున్నాయి. గతంలో రూపాయి ఇస్తే పావలా మాత్రమే లబ్ధిదారులకు చేరేది. ఇప్పుడు నేరుగా నగదు బదిలీ ద్వారా రూపాయి ఇస్తే రూపాయి లబ్ధిదారుల ఖాతాల్లోకి వెళ్తోంది. గత నాలుగేళ్లలో నవరత్నాల పథకాల ద్వారా రూ.2.11 లక్షల కోట్లు లబ్ధిదారుల ఖాతాలకు నేరుగా నగదు జమ అయింది. రేషన్ కార్డు, ఆరోగ్య శ్రీ కార్డు, పెన్షన్, ఇంటి జాగా ఇలా ఏ ప్రభుత్వ పథకం కావాలన్నా.. లేదా ఏ ప్రభుత్వ సేవలు కావాలన్నా గ్రామ, వార్డు సచివాలయాల్లోనే అందుతున్నాయి. గతానికి, ఇప్పటికీ ఇదో గొప్ప మార్పు.

రేషన్ డోర్ డెలివరీతో రోల్ మోడల్

పేదల ఇంటి వద్దకే రేషన్ డోర్ డెలివరీ చేయడంలో ఆంధ్రప్రదేశ్ రోల్ మోడల్‌గా నిలిచింది. ఏ పల్లెలో అయినా, పట్టణంలో అయినా రేషన్ బియ్యం మన వీధికి, మన ఇంటి ముంగిటకే అందించే వ్యవస్థ దేశంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మాత్రమే అమల్లో ఉంది. మిగతా రాష్ట్రాలు ఈ వ్యవస్థను అమలు చేసేందుకు యత్నిస్తున్నాయి. రేషన్ షాపుల దగ్గర గంటల తరబడి క్యూలో నిలబడే దుస్థితిని నివారించి రాష్ట్ర వ్యాప్తంగా మొత్తంగా 9,260 డెలివరీ వ్యాన్‌లతో నాణ్యమైన సార్టెక్స్ బియ్యాన్ని నెలనెలా డెలివరీ చేస్తున్న ప్రభుత్వం దేశంలో ఏపీ ఒక్కటే.

అవ్వాతాతల ఇంటికే ప్రతి నెలా పెన్షన్

దేశంలో ఎక్కడా లేని విధంగా పేద అవ్వాతాతలు, వికలాంగులు, వితంతువులు, దీర్ఘ వ్యాధిగ్రస్తుల ఇంటికే ప్రతి నెలా పెన్షన్‌ను వలంటీర్ల ద్వారా అందిస్తున్న ఏకైక రాష్ట్రం ఆంధ్రప్రదేశ్. ప్రతి నెలా ఒకటో తేదీన సూర్యోదయానికి ముందే వలంటీర్ ఇంటింటికీ వచ్చి లబ్ధిదారుల చేతిలో పెన్షన్ సొమ్ము పెట్టే కార్యక్రమం సజావుగా సాగుతోంది. అర్హులైన పేదలకు పెన్షన్ మంజూరు, పంపిణీలో వచ్చిన మరో గొప్ప మార్పు ఇది.

వ్యవసాయం పండుగైంది

దేశంలోనే తొలిసారిగా రైతుల కోసం 10,778 రైతు భరోసా కేంద్రాలు (ఆర్బీకే) ఏర్పాటు చేయడం ద్వారా వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు కనిపిస్తున్నాయి. ఈ కేంద్రాలు విత్తనం నుంచి పంట కొనుగోలు వరకు ప్రతి సేవలోనూ రైతన్నకు తోడుగా ఉంటూ, వారి చేయి పట్టుకుని నడిపిస్తున్నాయి. ఆర్బీకేలలో 10,778 మంది అగ్రికల్చర్, హార్టికల్చర్ గ్రాడ్యుయేట్లు పని చేస్తూ రైతులకు తోడుగా ఉన్నారు.

'ఫ్యామిలీ డాక్టర్'తో ఆరోగ్యానికి భరోసా

రాష్ట్రంలో 10,592 గ్రామ, పట్టణ హెల్త్ క్లినిక్స్ ద్వారా ఆయా గ్రామాల్లోని ప్రజలకు ఉచితంగా చికిత్సలను అందుబాటులోకి తెస్తూ ప్రభుత్వం ఈ రంగంలో గొప్ప మార్పులను తీసుకొచ్చింది. ఈ క్లినిక్స్‌లో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ 24 గంటలూ అందుబాటులో ఉంటారు. 105 రకాల మందులు ఉంటున్నాయి. 14 రకాల పరీక్షలు చేస్తూ.. ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌తో అనుసంధానమై అక్కడే సేవలందిస్తూ కనిపిస్తున్నారు. గతానికి ఇప్పటికి వ్యవస్థలో ఇదో స్పష్టమైన మార్పు.

కొత్తగా మరో 13 జిల్లాలు

రాష్ట్రంలో 2019 నాటికి 13 జిల్లాలు ఉంటే జిల్లా పాలన వికేంద్రీకరణలో భాగంగా ప్రభుత్వం కొత్తగా 13 జిల్లాల ఏర్పాటు ద్వారా మొత్తం 26 జిల్లాలను చేసింది. 51 డివిజన్లను 78కి, 679 మండలాలను 691కి పెంపు ద్వారా మరింతగా పాలనను వికేంద్రీకరణ చేసింది. ఆఖరికి చంద్రబాబు నియోజకవర్గం కేంద్రమైన కుప్పంను రెవెన్యూ డివిజన్‌గా చేసింది ప్రస్తుత ప్రభుత్వమే. ప్రజలకు జిల్లా, డివిజన్, మండల పాలన సేవలను మరింత చేరువ చేయడంలో భాగంగా వికేంద్రీకరణ చేపట్టింది. ఇది పరిపాలన రంగంలో గొప్ప సంస్కరణగా నిలుస్తోంది.

సమగ్ర భూ సర్వేతో వివాదాలకు స్వస్తి

భూ వివాదాలకు శాశ్వత ముగింపు దిశగా వందేళ్ల తర్వాత సమగ్ర భూ సర్వే చేపట్టి గ్రామ స్థాయిలో గొప్ప మార్పునకు నాంది పలికింది. సమగ్ర భూ సర్వే కోసం గ్రామాలు, పట్టణాల్లో ఏకంగా 10,185 మంది సర్వేయర్లను నియమించింది. 40 డ్రోన్లు కొనుగోలు చేసింది. కబ్జాలకు, భూ వివాదాలకు శాశ్వతంగా స్వస్తి పలుకుతూ.. ప్రజల భూములపై శాశ్వత భూ హక్కును కల్పిస్తూ స్పష్టమైన భూ రికార్డులకు ప్రభుత్వం నాంది పలికింది.

టెండర్ల విధానంలో పారదర్శకత

జ్యుడీషియల్ ప్రివ్యూతో పాటు రివర్స్ టెండర్ ద్వారా టెండర్ల విధానంలో పారదర్శకతకు పెద్ద పీట వేసింది. దేశ చరిత్రలో ఎక్కడా లేని విధంగా తొలిసారి జ్యుడీషియల్ ప్రివ్యూను ఏర్పాటు చేసింది. ఇందుకోసం ఏపీ మౌలిక సదుపాయాలు (తొలుత న్యాయ పరమైన సమీక్ష ద్వారా పారదర్శకత) చట్టం–2019ను అమల్లోకి తెచ్చింది. రూ.100 కోట్లు పైబడిన పనుల టెండర్లన్నీ జ్యుడీషియల్ ప్రివ్యూకు వెళ్తున్నాయి. రివర్స్ టెండర్ ద్వారా ప్రజా ధనం ఆదాకు పెద్దపీట వేస్తూ తెచ్చిన సంస్కరణలు మంచి ఫలితాలిస్తున్నాయి.

'స్పందన'తో ప్రజా సమస్యల పరిష్కారం

అధికారంలోకి వచ్చిన నాటి నుంచే రాష్ట్ర, జిల్లా, డివిజన్, మండల, గ్రామ, వార్డు సచివాలయాల స్థాయిలో ప్రజా సమస్యలు, ఫిర్యాదుల పరిష్కారానికి 'స్పందన' కార్యక్రమాన్ని అమల్లోకి తెచ్చింది. ప్రతి సోమవారం స్పందన కార్యక్రమాన్ని గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి కార్యాలయాల్లో సంబంధిత ఉన్నతాధికారులు స్వయంగా నిర్వహిస్తున్నారు. 1902కు ఫోన్ చేసి సమస్యను చెబితే.. దాన్ని నమోదు చేసుకుని నిర్దీత సమయంలోగా పరిష్కరించే ఏర్పాటు చేశారు. దీన్ని మరింత నాణ్యతతో అమలు చేయడంలో భాగంగా ప్రజా సమస్యల పరిష్కారం కోసం జగనన్నకు చెబుదాం కార్యక్రమంగా మార్చారు. ఇది ప్రజల సమస్యల పరిష్కారానికి వ్యవస్థలో తీసుకువచ్చిన గొప్ప మార్పుగా నిలుస్తోంది.

మహిళా సాధికారత దిశగా అడుగులు

మహిళలకు ప్రభుత్వ నామినేటెడ్ పనులు, నామినేటెడ్ పదవుల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ఏకంగా చట్టాలు చేసి, అమలు చేస్తోంది. దేశంలో ఏ రాష్ట్రంలోనూ మహిళల కోసం ఇలాంటి చట్టాలు చేసిన దాఖలాల్లేవు. జెండర్ బేస్ట్ బడ్జెట్ పేరుతో మహిళలకు, పిల్లలకు బడ్జెట్ ప్రత్యేక కేటాయింపులు చేస్తోంది. 31 లక్షలకు పైగా ఇళ్ల స్థలాలను మహిళల పేరిట ఇచ్చిన ఏకైక ప్రభుత్వం ఇదే. మహిళా సాధికారత దిశగా వేగంగా అడుగులు వేస్తోంది. రాష్ట్రంలో స్థాపించే పరిశ్రమలు, కంపెనీల్లో స్థానిక యువతకు ఉద్యోగాల్లో 75 శాతం ఇవ్వాలని ప్రత్యేకంగా చట్టం చేసి, అమలు చేస్తోంది. స్థానికంగా యువతకు ఎక్కువగా ఉపాధి కల్పించే ఎంఎస్ఎంఈ రంగాలను ప్రోత్సహిస్తోంది.

మారిన విద్య, వైద్య రంగాలు

ప్రజలకు విద్య, వైద్యం అందించాల్సిన కనీస సామాజిక బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాలకు ఉంటుంది. ఈ రెండు రంగాల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భారీ మార్పులకు శ్రీకారం చుట్టడంతో ఫలితాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ప్రభుత్వ రంగంలోని విద్య, వైద్య సంస్థలను వేగంగా బలోపేతం చేస్తున్నారు. మారుతున్న సాంకేతికతతో పాటు భవిష్యత్‌లో అవసరమైన రంగాల్లో మానవ వనరులను అభివృద్ధి చేసేందుకు బోధనా పద్ధతుల్లో, పాఠ్యాంశాల్లో మార్పులు తెచ్చారు. నైపుణ్యాలతో కూడిన యువతను తయారు చేయడానికి బాటలు వేశారు. వైద్య రంగంలో గతంలో ఎన్నడూ లేని విధంగా మార్పులు తెచ్చారు. రెండేళ్లలోనే 48,639 మంది వైద్యులు, వైద్య సిబ్బందిని నియమించడం ద్వారా అన్ని స్థాయి వైద్య సంస్థల్లో మెరుగైన వైద్య చికిత్సలను అందుబాటులోకి తెచ్చారు.

నాడు ఎన్టీఆర్‌ను తిట్టారు.. నేడు దండలు వేస్తున్నారు

చంద్రబాబు, టీడీపీ నేతల తీరుపై ఆర్జీవీ, పోసాని, లక్ష్మీపార్వతి ఆగ్రహం

- రాజమండ్రిలో జరుగుతున్నది పెద్ద జోక్
- ఎన్టీఆర్ కూడా నవ్వాలో.. ఏడ్వాలో అర్థం కాని జోక్ అది
- చంద్రబాబు, టీడీపీ నేతల తీరుపై సినీ దర్శకుడు రామ్‌గోపాల్‌వర్మ విమర్శ
- వైఎస్సార్‌సీపీని మళ్లీ మళ్లీ గెలిపిస్తేనే ఎన్టీఆర్ ఆత్మకు శాంతి
- ఏపీ ఎఫ్‌డీసీ చైర్మన్ పోసాని కృష్ణమురళి
- విజయవాడలో ఘనంగా ఎన్టీఆర్ శతజయంతి వేడుకలు
- ఎన్టీఆర్ విజ్ఞాన్ ట్రస్టు, దేవినేని నెహ్రూ చారిటబుల్ ట్రస్టుల ఆధ్వర్యంలో నిర్వహణ



పోసానికి ఎన్టీఆర్ లలిత కళా పురస్కారం అందజేస్తున్న లక్ష్మీపార్వతి, రామ్‌గోపాల్‌వర్మ తదితరులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): 'నేను ఒక సీరియస్ జోక్ చెప్పడానికే ఇక్కడికి వచ్చాను. ఆ జోక్ ప్రస్తుతం రాజమండ్రిలో జరుగుతోంది. స్వర్గంలో ఉన్న ఎన్టీఆర్ కూడా నవ్వాలో.. ఏడ్వాలో అర్థం కాని జోక్ అది. ఆయన మరణానికి కారణమైన వాళ్లే.. ఇప్పుడు ఎన్టీఆర్ కంటే గొప్ప వ్యక్తి లేరు అంటూ కీర్తిస్తున్నారు' అని టీడీపీ మహానాడును ఉద్దేశించి సినీ దర్శకుడు రామ్‌గోపాల్‌వర్మ అన్నారు. నాడు లక్ష్మీపార్వతితో ఉన్న ఎన్టీఆర్‌ను తిట్టిన వాళ్లే.. నేడు ఆయనకు ఎందుకు దండలు వేస్తున్నారో అర్థం కావడం లేదన్నారు. ఎన్టీఆర్ విజ్ఞాన్ ట్రస్టు, దేవినేని నెహ్రూ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో విజయవాడలో ఆదివారం ఎన్టీఆర్ శత జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా అతిథులు ఎన్టీఆర్ లలిత కళా అవార్డును పోసాని కృష్ణమురళికి ప్రదానం చేశారు. అనంతరం రామ్‌గోపాల్‌వర్మ మాట్లాడుతూ.. చంద్రబాబు ఎలాంటి వ్యక్తి అనేది స్వయంగా ఎన్టీఆరే చెప్పారన్నారు. రజనీకాంత్ లాంటి వ్యక్తి రాష్ట్రానికి వచ్చి ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచిన వాళ్లతో కూర్చున్నారంటే.. ఒకరకంగా ఆయన కూడా ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడుస్తున్నట్లేనన్నారు. నందమూరి కుటుంబంలో ఉన్న ఒకే ఒక్క మగాడు జూనియర్ ఎన్టీఆర్ అని పేర్కొన్నారు. తాతకు వెన్నుపోటు పొడిచిన వారితో వేదిక పంచుకోవడం ఇష్టం లేకే.. ఆయన వీళ్లందరికీ దూరంగా ఉంటున్నారన్న విషయం స్పష్టమవుతోందన్నారు. తాను 'వ్యూహం' సినిమా తీస్తున్నానని, అందులో చంద్రబాబు క్యారెక్టర్‌ను అరటిపండులా వలిచి చూపిస్తానని ప్రకటించారు.

లక్ష్మీపార్వతిపై బాబు వదంతులు

ఏపీ ఎఫ్‌డీసీ చైర్మన్ పోసాని కృష్ణమురళి మాట్లాడుతూ.. ఏ కులం, ఏ మతం వారితో అయినా స్నేహం చేయవచ్చు కానీ.. గుణం లేని వారితో మాత్రం చేయకూడదన్నారు. గుణం లేని వాడు చంద్రబాబు అని.. అతనికి దూరంగా ఉండటం చాలా మంచిదని సూచించారు. తన మంచిచెడులు చూసుకునేందుకు లక్ష్మీపార్వతిని ఎన్టీఆర్ ఆహ్వానించారని, కానీ ఆమెపైనా చంద్రబాబు అనేక పుకార్లు పుట్టించారని చెప్పారు. చంద్రబాబు వల్ల ఎన్టీఆర్‌కు మూడుసార్లు గుండెపోటు వచ్చినా.. లక్ష్మీపార్వతి ఒక్కరే అండగా నిలిచారని చెప్పారు. రాష్ట్రంలో మళ్లీ మళ్లీ వైఎస్సార్‌సీపీని గెలిపిస్తేనే ఎన్టీఆర్ ఆత్మకు శాంతి కలుగుతుందన్నారు.

బాబు కుట్రలకు ఎన్టీఆర్ కుమిలిపోయారు

తెలుగు అకాడమీ చైర్‌పర్సన్ నందమూరి లక్ష్మీపార్వతి మాట్లాడుతూ.. అడ్డదారుల్లో అధికారాన్ని లాక్కునేందుకు చంద్రబాబు చేసిన కుట్రలపై ఎన్టీఆర్ ఎంతగానో కుమిలిపోయారని చెప్పారు. ఎన్టీఆర్‌ను అడుగడుగునా వేధింపులకు గురిచేశారన్నారు. ఎన్టీఆర్ కష్టకాలంలో దేవినేని నెహ్రూ అన్నీ తానై నిలిచారని పేర్కొన్నారు. ఎన్టీఆర్ పేరుతో జిల్లా ఏర్పాటు చేసినందుకు సీఎం జగన్‌కు ధన్యవాదాలు తెలిపారు. తన గౌరవాన్ని నిలబెట్టిన జగన్‌కు జీవితాంతం రుణపడి ఉంటానని చెప్పారు. మాజీ మంత్రి పేర్ని నాని మాట్లాడుతూ.. ఎన్టీఆర్ ప్రారంభించిన పథకాలు ఎప్పటికీ చిరస్మరణీయమేనని అన్నారు. ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ఎన్టీఆర్ పార్టీ స్థాపించినప్పటి నుంచి మరణించే వరకు ప్రతి ఘటననూ తాను ప్రత్యక్షంగా చూశానని చెప్పారు. ఎన్టీఆర్ లాంటి గొప్ప మనిషి కూడా చంద్రబాబు కుట్రకు బలయ్యారన్నారు. దేవినేని నెహ్రూ చారిటబుల్ ట్రస్టు కన్వీనర్, వైఎస్సార్‌సీపీ విజయవాడ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాశ్ మాట్లాడుతూ.. ఎన్టీఆర్, వైఎస్సార్ ఒక కులానికో, పార్టీకో పరిమితం కాదన్నారు. వారు మహనీయులని.. తెలుగు జాతి గొప్పతనాన్ని ప్రపంచానికి చాటి చెప్పారని కొనియాడారు. సభలో ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, మేయర్ రాయన భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

జిల్లా వార్తలు

దేశ సుభిక్షం కోసమే సైకిల్ యాత్ర




సైకిల్ యాత్ర చేస్తున్న విజయ గోపాలకృష్ణ

పినపాక: దేశం సుభిక్షంగా ఉండాలని, ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షిస్తూ కర్ణాటక రాష్ట్రం రాయచూర్ జిల్లాలోని సింగూర్ గ్రామానికి చెందిన విజయ గోపాలకృష్ణ సైకిల్ యాత్ర చేపట్టారు. 440 రోజులుగా సుమారు 39 వేల కిలోమీటర్లు సైకిల్‌పై అనేక రాష్ట్రాలు తిరుగుతూ ఆదివారం బయ్యారం క్రాస్ రోడ్డుకు చేరుకున్నాడు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జల, జంతు, వన సంరక్షణ కోసం గత కొన్ని నెలలుగా యాత్ర కొనసాగిస్తున్నట్లు తెలిపారు. దేశ వ్యాప్తంగా పలు ప్రసిద్ధ దేవాలయాలను దర్శించుకున్నట్లు చెప్పారు.

కిన్నెరసానిలో పర్యాటకుల సందడి

ఒకరోజు ఆదాయం రూ. 34,375



రిజర్వాయర్‌లో బోటింగ్ చేస్తున్న పర్యాటకులు

పాల్వంచరూరల్ : పర్యాటక ప్రాంతమైన కిన్నెరసాని పరిసరాలు ఆదివారం సందడిగా మారాయి. జిల్లాతో పాటు ఇతర ప్రాంతాల నుంచి సైతం భారీగా పర్యాటకులు తరలివచ్చారు. డీర్ పార్కులోని దుప్పులను, డ్యామ్‌పై నుంచి జలాశయాన్ని వీక్షించారు. అనంతరం బోటు షికారు చేశారు. 563 మంది పర్యాటకులు ప్రవేశించడం ద్వారా వైల్డ్‌లైఫ్ శాఖకు రూ.19,255, 280 మంది బోటింగ్ చేయడం ద్వారా టూరిజం శాఖకు రూ.15,120 ఆదాయం లభించినట్లు నిర్వాహకులు తెలిపారు.

స్పీడ్ బోట్‌కు మరమ్మతులెప్పుడో..?

కిన్నెరసానిలోని ఆరుసీట్ల సామర్థ్యం గల స్పీడ్ బోట్ ఇంజన్ వారం క్రితం మరమ్మతులకు గురైంది. ఇప్పటివరకు రిపేర్ చేయించకపోవడంతో పర్యాటక శాఖ భారీగా ఆదాయం కోల్పోతోంది. ఈ బోట్ ద్వారా ప్రతి ఆదివారం రూ.10వేలకు పైగా ఆదాయం సమకూరేది. పర్యాటకులు సైతం దీనిపై బోటింగ్ చేసేందుకే ఎక్కువగా ఇష్టపడతారు. బోట్ ఇంజన్‌ను మరమ్మతు కోసం ఆపరేటర్ హైదరాబాద్‌కు తీసుకెళ్లినా.. ఇంతవరకు అందుబాటులోకి రాలేదు. దీంతో పర్యాటకులు నిరుత్సాహానికి గురవుతుండగా, టూరిజం శాఖ ఆదాయం కోల్పోతోంది.

పెరుగుతున్న నిర్వాసిత జాబితా



నిర్వాసిత ప్రాంతంలో సర్వే చేస్తున్న సింగరేణి, రెవెన్యూ అధికారులు (ఫైల్)

- ఇల్లెందు జేకేఓసీ నిర్వాసితుల సంఖ్యపై భిన్నవాదనలు
- అయినా మరికొన్ని పేర్లతో నేతల నుంచి అధికారులకు సిఫారసులు
- పరిహారమే తప్ప ఉద్యోగాలు రావని స్పష్టంచేస్తున్న 'సింగరేణి'
- ఉద్యోగాల పేరిట నమ్మబలికి వసూళ్లకు పాల్పడుతున్న పలువురు?

ఇల్లెందురూరల్: పట్టా ఉన్నా లేకపోయినా.. గిరిజనులైనా, గిరిజనేతరులైనా సాగులో ఉన్న భూనిర్వాసితులందరికీ పరిహారం చెల్లిస్తామని పలుమార్లు రెవెన్యూ అధికారులు స్పష్టం చేశారు. అయినా ఎక్కడో నెలకొన్న భయంతో ఓ గిరిజనేతర రైతు చేసిన తప్పిదం ఇప్పుడు ఇల్లెందులోని సింగరేణి జేకే ఓసీ నిర్వాసిత జాబితానే తప్పుపట్టే స్థితికి చేర్చింది. నిర్వాసిత జాబితాలో కొత్త రైతుల పేర్లు ఉన్నాయన్న స్థానికుల అభ్యంతరం వాస్తవమే అయినా వాస్తవ రైతు నుంచి అభ్యంతరాలు లేకపోవడంతో అధికారులు సైతం ఏమీ చేయలేకపోతున్నారు. కానీ, నిర్వాసిత జాబితాలో రైతుల సంఖ్య ఎలా పెరిగింది, అందుకు కారణాలేమిటనే ప్రశ్నలు అందరి మదిని తొలుస్తున్నాయి. ఈ విషయంలో స్థానిక నేతలు ఒకరిద్దరి పాత్రపై అనుమానాలు వెల్లువెత్తుతున్నాయి.

వాస్తవ భూవిస్తీర్ణం 154 హెక్టార్లు

ఇల్లెందులో జేకే-5 ఓసీలో బొగ్గు నిల్వలు తరిగిపోవడంతో సింగరేణి యాజమాన్యం జేకేఓసీ ఏర్పాటుకు సన్నాహాలు ప్రారంభించింది. ఇందుకోసం భూసేకరణలో భాగంగా మండలంలోని సీఎస్పీ బస్తీ గ్రామపంచాయతీ సమీపాన అటవీశాఖ పరిధిలోని సర్వే నంబర్ 549లో 261.33 హెక్టార్ల భూభాగం అవసరమైంది. ఇందులో ఇప్పటికే కొంతమంది రైతులు సాగు చేసుకుంటున్నట్లు సింగరేణి అధికారులు గుర్తించారు. సర్వే ఆధారంగా నిర్వాసిత భూమి 154 హెక్టార్లుగా నిర్ధారించారు.


ముందస్తు సమాచారంతో..

సాధారణంగా నిర్వాసిత రైతులకు సింగరేణి ద్వారా మెరుగైన ప్యాకేజీ లభిస్తుంది. అంతేకాకుండా గతంలో జేకే-5 ఓసీ గిరిజన నిర్వాసితులకు ఉద్యోగాలు కూడా ఇవ్వడంతో జేకేఓసీ విస్తరణలోనూ భూమి కోల్పోయే గిరిజన రైతులకు కూడా ఉద్యోగాలు వస్తాయని ఊహించారు. కానీ, జీఓ 34 ప్రకారం ఉద్యోగ అవకాశాలు ఇచ్చే అవకాశాన్ని ప్రభుత్వం 2015-16 ఆర్థిక సంవత్సరంలో రద్దు చేసింది. అప్పటికే జేకే-5 ఓసీ నిర్వాసితుల వివరాలు నమోదు కావడంతో వారికి మాత్రం ఉద్యోగాలు వచ్చాయి. ఈ విషయం తెలియని చాలా మంది గిరిజనులు ఈ ప్రాంతంలో భూములు కొనేందుకు ఉత్సాహం చూపించారు. ఈ విషయాన్ని గుర్తించి రంగప్రవేశం చేసిన దళారీ, సీఎస్పీ బస్తీ గ్రామానికి చెందిన ఒక గిరిజనేతర రైతును బుట్టలో వేసుకుని ఆయన నుంచి ఏడుగురు గిరిజన రైతులు 18 ఎకరాల భూమిని 2017లో కొన్నట్లుగా పత్రాలు సృష్టించారు. ఇదంతా సాఫీగానే సాగడంతో ఉద్యోగం వస్తుందని ఉత్సాహంగా ఉన్న గిరిజన రైతులను గుర్తించి 18 ఎకరాలను ఒక్కొక్కరికి 20 గుంటలు చొప్పున 36 మందికి సంబంధిత దళారీ విక్రయించారు. ఇందుకోసం వాస్తవ భూమి ధరతోపాటు ఉద్యోగం వస్తుందని నమ్మబలికి అదనంగా పెద్ద మొత్తంలో వసూలు చేసినట్లుగా సమాచారం.

జాబితాలోకి కొత్తగా 36 మంది పేర్లు..

దళారీ నుంచి ఒక్కొక్కరు 20 గుంటలు చొప్పున 18 ఎకరాలు కొనుగోలు చేసిన 36 మంది రైతుల పేర్లు నిర్వాసితుల జాబితాలో 2021 జూలై 31న నిర్వహించిన గ్రామసభ నాటికే నమోదయ్యాయి. దీంతో తమ వ్యూహం ఫలించిందని దళారీ, ఆయన మిత్ర బృందం సంబరపడింది. దీనిని గుర్తించి మరికొందరు గిరిజన రైతులు భూమిని తమ కుటుంబ సభ్యులకు కేటాయించి వారి పేర్లను కూడా నిర్వాసితుల జాబితాలో నమోదు చేయించారు. ఫలితంగా నిర్వాసిత రైతుల సంఖ్య ఏకంగా 107కు పెరిగింది. అంతేకాకుండా తాజాగా నిర్వహించిన ఆర్ఓఎఫ్ఆర్ గ్రామసభ నాటికి ఆ సంఖ్య 114కు చేరడం గమనార్హం. ఈ తతంగాన్ని గుర్తించిన పలువురు రైతులు గ్రామసభలో జాబితాలో కొత్త రైతుల పేర్లు ఉండడంపై అభ్యంతరం వ్యక్తం చేయడంతో మొత్తంగా జేకేఓసీ నిర్వాసిత జాబితా వివాదాస్పదమైంది. ఈ వివాదం కొనసాగుతుండగానే మరో 15 మంది పేర్లు నమోదు చేయాలని అధికారులకు సమాచారం అందింది. ఈ సిఫారసు చేసిన వారు రాజకీయ పెద్దలు కావడంతో ఏం చేయాలో పాలుపోని స్థితిలో అధికారులు కొట్టుమిట్టాడుతున్నారు.

రైతుల నుంచి ఫిర్యాదులొస్తే చర్యలు



జేకేఓసీ నిర్వాసిత ప్రాంతంగా గుర్తించిన వాస్తవ విస్తీర్ణానికి మాత్రమే పరిహారం చెల్లిస్తాం. క్షేత్రస్థాయి విచారణ ద్వారా ఇప్పటివరకు వచ్చిన అభ్యంతరాలన్నింటినీ పరిష్కరించాం. రైతుల సంఖ్య పెరగడంపై వస్తున్న ఆరోపణల నేపథ్యాన ఉన్నతాధికారులకు నివేదిక ఇస్తాం. ఎవరైనా ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం.

–కృష్ణవేణి, తహసీల్దార్, ఇల్లెందు

రేపటి నుంచి జాతీయ మహిళా టీ-20 క్రికెట్ టోర్నీ



బ్రోచర్లు ఆవిష్కరిస్తున్న ప్రదీప్‌కుమార్ తదితరులు

- ఫ్లడ్ లైట్ల వెలుతురులో మ్యాచ్‌లు
- ఎనిమిది రోజుల పాటు సీజన్-2 మ్యాచ్‌ల కొనసాగింపు

ఖమ్మం స్పోర్ట్స్ : యువం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆలిండియా మహిళా టీ-20 క్రికెట్ అసోసియేషన్ సౌజన్యంతో జాతీయస్థాయి మహిళా టీ -20 క్రికెట్ టోర్నమెంట్‌ను నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో నిర్వహిస్తున్నట్లు యువం ఫౌండేషన్, ఖమ్మం మహిళా క్రికెట్ అసోసియేషన్ చైర్మన్ డాక్టర్ కూరపాటి ప్రదీప్‌కుమార్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఈనెల 30 నుంచి జూన్ 6వ తేదీ వరకు జరిగే ఈ పోటీలకు తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, వెస్ట్ బెంగాల్, డయ్యూ డామన్, మహారాష్ట్ర, గుజరాత్, బీహార్, ఉత్తరాఖాండ్, జమ్ము కశ్మీర్, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన మహిళా క్రికెటర్లు పాల్గొంటారని వివరించారు. మొత్తం 180 మంది క్రీడాకారులతో పాటు అధికారులు హాజరవుతారని తెలిపారు. నగరంలోని ప్రముఖ లాడ్జిలలో క్రీడాకారులకు వసతి సౌకర్యం ఏర్పాటు చేశామన్నారు. అయా రాష్ట్రాలకు అనుగుణంగా భోజన ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. సీజన్-2లో విజేతలుగా నిలిచిన జట్లకు నగదు బహుమతితో పాటు ట్రోఫీలు అందజేస్తామని చెప్పారు. ఫ్లడ్ లైట్ల వెలుతురులో పోటీలు కొనసాగేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. టోర్నీ ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎండీ మతిన్ మాట్లాడుతూ ప్రతి రోజు సాయంత్రం 4 నుంచి రాత్రి 11 గంటల వరకు మ్యాచ్‌లు నిర్వహిస్తామని చెప్పారు. టోర్నీ పరిశీలనకు జాతీయ కార్యదర్శి సందీప్ ఆర్యను నియమించినట్లు వివరించారు. పోటీల ప్రారంభ కార్యక్రమానికి రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరు కానున్నారని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర జట్టుకు కోచ్, మేనేజర్‌గా ఝాన్సీ, వినోద వ్యవహరిస్తారని పేర్కొన్నారు.

కార్మిక హక్కులను మోదీ కాలరాస్తున్నారు

సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి భాస్కర్



మాట్లాడుతున్న పాలడుగు భాస్కర్

సింగరేణి(కొత్తగూడెం): దేశ స్వాతంత్ర్యానికి ముందే పోరాడి సాధించుకున్న కార్మిక హక్కుల చట్టాలను కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం కాలరాస్తోందని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ ఆరోపించారు. కొత్తగూడెంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ సర్కార్ మతోన్మాద అజెండాను ముందుకు తీసుకొస్తూ దేశంలో కుల, మత ఘర్షణలకు కారణమవుతోందని విమర్శించారు. భిన్నత్వంలో ఏకత్వంగా ఉన్న భారతదేశాన్ని మత విద్వేషాలతో రెచ్చగొట్టడం తగదని హితవు పలికారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.బ్రహ్మచారి, ఏజే రమేష్, నాయకులు భూక్యా రమేష్, పద్మ, ఎంవీ అప్పారావు, గద్దల శ్రీను, పిట్టల అర్జున్, ఈసం వెంకటమ్మ, డి.వీరన్న, కె.సత్య, రాజు పాల్గొన్నారు.

బంక్‌కు కాదు.. బ్యాంక్‌కు వెళ్లాలి..



రూ.2 వేల నోట్లను ఉపసంహరించుకుంటున్నట్లు ప్రకటించిన ఆర్‌బీఐ.. సెప్టెంబర్ 30వ తేదీలోపు బ్యాంకుల్లో మార్చుకోవాలని సూచించింది. అయితే, చాలామంది బ్యాంకుల్లో కాకుండా ఇతర మార్గాల్లో మార్చుకునేందుకు యత్నిస్తున్నారు. ఈ క్రమంలోనే రూ.50, రూ.100, రూ.200 పెట్రోల్ పోయించుకుని బంకుల్లో రూ.2 వేల నోట్లు ఇస్తుండడంతో చిల్లర తిరిగి ఇవ్వడం బంక్ సిబ్బందికి తలనొప్పిగా మారింది. దీంతో ఖమ్మంలోని ఓ బంక్ వద్ద రూ.2 వేలు ఆపైన పెట్రోల్ కొనుగోలు చేస్తేనే రూ.2 వేల నోట్లు తీసుకుంటామని ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. కరెన్సీ మార్పిడి సదుపాయం బ్యాంకులకే పరిమితమనే సూచన కూడా చేయడం విశేషం!

–స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఖమ్మం